మద్యపానంతో క్యాన్సర్ ముప్పు

- 7రకాల క్యాన్సర్లకు కారణమవుతున్న ఆల్కహాల్
- దాని సేవనంలో సురక్షిత మోతాదు ఉండదు
- అమెరికా సర్జన్ జనరల్ నివేదికలో వెల్లడి

న్యూయార్క్, జనవరి 4: సిగరెట్, పొగాకు క్యాన్సర్‌కు కారణమవుతాయనే అవగాహన చాలామందికి ఉంది. అయితే, మద్యం విషయంలో మాత్రం భిన్నమైన మాటలు వినిపిస్తుంటాయి. రోజూ కొంత మోతాదులో మద్యపానం సురక్షితమేనని, రెడ్ వైన్ ఆరోగ్యానికి మేలు చేస్తుందనే రకరకాల ప్రచారాలు ఉన్నాయి. ఈ ప్రచారాలను అమెరికా సర్జన్ జనరల్ తాజా నివేదిక కొట్టిపారేసింది. మద్యపానంలో సురక్షిత మోతాదు అనేదేమీ ఉండదని, ఎంత తాగినా ఆరోగ్యానికి నష్టం తప్పదని స్పష్టం చేసింది. పొగాకు లాగానే మద్యపానం కూడా క్యాన్సర్‌కు కారణమవుతుందని స్పష్టం చేసింది. మద్యపానంతో క్యాన్సర్ ముప్పుపై శుక్రవారం అమెరికా సర్జన్ జనరల్ డాక్టర్ వివేక్ మూర్తి ఒక నివేదికను విడుదల చేశారు. అమెరికాలో వైద్యపరంగా సర్జన్ జనరల్ హోదా కీలకమైనది. దేశాధ్యక్షుడు స్వయంగా నియమించే సర్జన్ జనరల్.. దేశ ప్రజలకు అవసరమైన ఆరోగ్య మార్గదర్శకాలను జారీ చేస్తారు.

2014 నుంచి అమెరికన్ క్యాన్సర్ సొసైటీతో పాటు వివిధ సంస్థలు క్యాన్సర్‌పై చేసిన అధ్యయనాల ఆధారంగా అమెరికా సర్జన్ జనరల్ ఈ నివేదికను విడుదల చేశారు. మద్యపానం వల్ల రొమ్ము, కొలొరెక్టల్(పెద్ద పేగు), అన్నవాహిక, కాలేయ, నోటి, గొంతు, స్వరపేటిక క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొన్నది. ధూమపానం వల్ల 19 శాతం క్యాన్సర్ కేసులు, 29 శాతం క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయని, అధిక శరీర బరువు వల్ల 7.8 శాతం క్యాన్సర్ కేసులు, 6.5 శాతం క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపింది. ఈ రెండింటి తర్వాతి స్థానంలో మద్యపానం ఉందని, 5.6 క్యాన్సర్ కేసులకు, 4 శాతం క్యాన్సర్ మరణాలకు మద్యపానమే కారణమని వెల్లడించింది. యూవీ రేడియేషన్ కంటే మద్యం వల్లే క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నట్టు తెలిపింది.

మహిళలకు ఎక్కువ ముప్పు

అమెరికాలో ఏటా లక్ష క్యాన్సర్ కేసులకు, 20 వేల క్యాన్సర్ మరణాలకు మద్యపానమే కారణమవుతున్నదని ఈ నివేదిక వెల్లడించింది. మద్యపానం చేసే మహిళలకు క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుందని ఈ నివేదిక పేర్కొన్నది. బ్రెస్ట్ క్యాన్సర్ కేసుల్లో దాదాపు 17 శాతం వాటికి మద్యపానం కారణం కావొచ్చని తెలిపింది. మహిళలు వారానికి కేవలం రెండు డ్రింక్స్ తీసుకోవడం వల్ల క్యాన్సర్ ముప్పు పురుషుల కంటే వారిలో ఎక్కువగా ఉంటున్నదని వెల్లడించింది.

అణు కార్యక్రమ నిర్మాత అస్తమయం

- ముంబైలో తుది శ్వాస విడిచిన ఆర్ చిదంబరం
- పోఖ్రాన్‌లో అణు పరీక్షల నిర్వహణలో కీలక భూమిక

న్యూఢిల్లీ, జనవరి 4: భారత అణు కార్యక్రమ నిర్మాత రాజగోపాల చిదంబరం శనివారం కన్నుమూశారు. 1974, 1998లో నిర్వహించిన అణు పరీక్షలలో కీలక పాత్ర పోషించిన ఆయన ముంబైలోని జస్లోక్ దవాఖానలో తుదిశ్వాస విడిచినట్టు అణు ఇంధన శాఖ(డీఏఈ) వెల్లడించింది. భారత్ నిర్వహించిన అణ్వస్త్ర కార్యక్రమంలో కూడా చిదంబరం పాలుపంచుకున్నట్టు డీఏఈ తెలిపింది. 2001-2018 మధ్య భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ సలహాదారుగా, 1990-93 మధ్య బాబా ఆటామిక్ రిసెర్చ్ సెంటర్ చైర్మన్‌గా, 1993-2000 మధ్య అణు ఇంధన కమిషన్ చైర్మన్‌గా, భారత ప్రభుత్వ కార్యదర్శిగా ఆయన సేవలందించారు. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ(ఐఏఈఏ) బోర్డు ఆఫ గవర్నర్స్‌కు చైర్మన్‌గా(1994-95) కూడా ఆయన పనిచేశారు. 1936లో జన్మించిన చిదంబరం చెన్నైలోని పెసిడెన్సీ కాలేజీలో, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. భారతదేశ అణు సామర్థ్యాన్ని తీర్చి దిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. భారత్ తొలిసారి 1974లో పోఖ్రాన్‌లో నిర్వహించిన అణుపరీక్షల్లో కీలక భూమిక వహించిన ఆయన, రెండోసారి 1999లో జరిగిన అణు పరీక్షలకు సారథ్యం వహించారు. ఆయన మృతిపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆధునిక మెటీరియల్ సైన్స్ పరిశోధనలకు బీజం

భారత్ అణు శక్తిగా అవతరించడంలో ఆయన పాత్ర ఎనలేనిది. ప్రపంచస్థాయి భౌతిక శాస్త్రవేత్తగా అధిక పీడన భౌతిక శాస్త్రం, క్రిస్టల్లోగ్రఫీ, మెటీరియల్ సైన్స్‌లో ఆయన పరిశోధనలు ఆయా రంగాల్లో అవగాహన పెంపొందించుకోవడానికి శాస్త్రవేత్తలకు గణనీయంగా ఉపయోగపడ్డాయి. ఈ రంగాలలో ఆయన చేసిన కృషి భారత్‌లో ఆధునిక మెటీరియల్ సైన్స్ పరిశోధనకు బీజం వేసిందని డీఏఈ పేర్కొంది. అణు రంగంలో ఆయన సాగించిన విశేష కృషికి గుర్తింపుగా ఆయనకు అనేక ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. 1975లో పద్మశ్రీ, 1999లో పద్మ విభూషణ్ పురస్కారాలతో ప్రభుత్వం గౌరవించింది.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

ఆరుగురి మృతి

తమిళనాడులో దారుణం

చెన్నై: తమిళనాడులోని విరుధ నగర్‌లో ఓ బాణసంచా కర్మాగారంలో శనివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మరణించగా, అనేక మంది గాయపడ్డారు. గాయపడినవారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పేసి, సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పేలుడుకు కారణాన్ని స్పష్టంగా గుర్తించలేదు. పవర్ లీకేజీ కానీ, పేలుడు పదార్థాల రాపిడి కానీ కారణం కావొచ్చని భావిస్తున్నారు.

సైనిక వాహనం బోల్తా

నలుగురు జవాన్ల మృతి

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లోని బండీపురా జిల్లాలో శనివారం అదుపు తప్పిన సైనిక ట్రక్ కొండపై నుంచి దొర్లిపడడంతో నలుగురు జవాన్లు మరణించగా మరో ముగ్గురు గాయపడ్డారు. సదర్ కూట్ పయన్ సమీపంలో మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. కాగా, డిసెంబర్ 24న పూంచ్ జిల్లాలో ఓ సైనిక వాహనం 350 అడుగుల లోతైన లోయలో దొర్లిపడిన ప్రమాదంలో ఐదుగురు సైనికులు మరణించగా మరో ఐదుగురు గాయపడిన విషయం తెలిసిందే.

మీ ప్రవర్తన అమానవీయం

ఈడీ తీరును తప్పబట్టిన సుప్రీంకోర్టు

15 గంటల సుదీర్ఘ విచారణ నిందితుడు బలవంతంగా వాంగ్మూలం ఇచ్చేట్టుంది

న్యూఢిల్లీ, జనవరి 4: ఓ కేసులో నిందితుడిని 15 గంటల పాటు నిరంతరాయంగా విచారించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తీరును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. హర్యానా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సురేందర్ పన్వార్‌ను చట్టవిరుద్ధ ఇసుక తవ్వకం. మనీలాండరింగ్ కేసులో నిరుడు ఈడీ అరెస్టు చేసి విచారించింది. అయితే, ఈ కేసు ఉగ్రవాదానికి సంబంధించినది కాదని, ఇసుక అక్రమ మైనింగ్‌కు సంబంధించినదని గురువారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. 'ఈడీది అమానవీయ ప్రవర్తన. నిందితుడు బలవంతంగా వాంగ్మూలం ఇచ్చేట్టుంది' అని వ్యాఖ్యానించింది.

వృద్ధ తల్లిదండ్రులకు సుప్రీంకోర్టులో ఊరట

ఆస్తులను వారసులకు రాసిచ్చి, తర్వాత వారు చూడకపోవడంతో వృద్ధాప్యంలో తీవ్ర నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులకు ఊరటనిచ్చేలా సుప్రీం కోర్టు చారిత్రక తీర్పును వెలువరించింది. పిల్లలు తమను చూసుకోకపోతే వారికి రాసిచ్చిన ఆస్తి పత్రాలను రద్దు చేసే హక్కు వృద్ధ తల్లిదండ్రులకు ఉంటుందని తీర్పు చెప్పింది. వృద్ధ తల్లిదండ్రుల సంక్షేమం, నిర్వహణ చట్టం, 2007 ప్రకారం సీనియర్ సిటిజన్ల హక్కులను కాపాడటంలో న్యాయవ్యవస్థ నిబద్ధతను ఈ తీర్పు నొక్కి చెబుతుందని జస్టిస్‌లు సీటీ రవికుమార్, సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఆస్తులను తమ సంతానం, వారసులకు రాసిచ్చిన అనంతరం వారిని చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ తీర్పు సీనియర్ సిటిజన్ల హక్కును పరిరక్షిస్తుందని, వారికి రక్షణ కల్పిస్తుందని తెలిపింది.

ఈసారి మెట్రో బాదుడు

- 15% చార్జీల పెంపు యోచనలో కర్ణాటక సర్కార్
- నేడో రేపో పాల చార్జీలను పెంచనున్నట్టు ప్రకటన

బెంగళూరు, జనవరి 4: ప్రజలపై మరో అదనపు బాదుడుకు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. రెండు రోజుల క్రితమే ఆర్టీసీ బస్ చార్జీలు పెంచిన సిద్ధరామయ్య ప్రభుత్వం తాజాగా మెట్రో రైల్ టికెట్ ధరల పెంపునకు రెడీ అవుతున్నది. 10 నుంచి 15 శాతం టిక్కెట్ చార్జీల పెంపు ఉండవచ్చునని భావిస్తున్నారు. శక్తి పథకం పేరుతో మహిళా ప్రయాణికులకు అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం భారాన్ని తగ్గించుకోవడానికి బస్సు చార్జీలను 15 శాతం పెంచుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సర్కారు గురువారం నిర్ణయం తీసుకుంది. 2023లో గెలుపే లక్ష్యంగా ఎడాపెడా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తర్వాత వివిధ సేవల చార్జీలను కూడా ఎడాపెడా పెంచుతూ తమపై బారం మోపుతున్నదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికే పెట్రోల్, కొత్త వాహనాలపై అదనపు సర్ చార్జీలను పౌరుల నుంచి వసూలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ చార్జీలు పెంచింది. త్వరలో పాల ధరలను కూడా పెంచుతామని ప్రకటించింది. ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ బెంగళూరులోని నమ్మ మెట్రో చార్జీల పెంపునకు సిఫార్సు చేసింది. 10-15 శాతం మేర మెట్రో చార్జీలను పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

గోశాల ప్రాజెక్టుకు మంగళం!

రాష్ట్రంలో గోవులను కాపాడే లక్ష్యంతో తాము ప్రారంభించిన గోశాల ప్రాజెక్టును రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని ప్రతిపక్ష బీజేపీ శనివారం ఆరోపించింది. గతంలో బీజేపీ ప్రభుత్వ పాలనలో ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 35 గోశాలలను మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తోందని బీజేపీ ఆరోపించింది. గోవులను కాపాడటమంటే ఈ దేశ సంస్కృతిని కాపాడటమేనని ఎక్స్ వేదికగా బీజేపీ పేర్కొంది.

కుంభ మేళాలో తిరుమల నమూనా ఆలయం

తిరుపతి: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభ మేళాకు హాజరయ్యే భక్తులు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడిని దర్శనం చేసుకోవచ్చు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. టీటీడీ నమూనా ఆలయాన్ని మహా కుంభ మేళాలోని సెక్టర్-6లో వాసుకి ఆలయం పక్కన నిర్మిస్తున్నారు. తిరుమలలోని శ్రీవారి ఆలయంలో జరిగే శ్రీవారి కల్యాణోత్సవాలు, చక్రస్నానం వంటి కైంకర్యాలను ఇక్కడ కూడా నిర్వహించనున్నారు. కుంభమేళాలోని టీటీడీ ఆలయానికి పెద్ద ఎత్తున తరలి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు బీఆర్ నాయుడు తెలిపారు.

కర్ణాటకలో మరో భూ కుంభకోణం

లబ్ధిదారుల పేరిట రూ.16.85 కోట్ల విలువైన స్థలాలు స్వాహా

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఇప్పటికే ముడా కుంభకోణం ప్రకంపనలు సృష్టిస్తుండగా, తాజాగా రూ.16.85 కోట్ల అంబేద్కర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్‌ను లోకాయుక్త బయటపెట్టింది. విజయపుర జిల్లాలో ఉన్న ఈ సొసైటీ ద్వారా రూ.16.85 కోట్ల భూ కేటాయింపు స్కామ్ జరిగినట్టు వెల్లడించింది. భూమి లేని ఎస్సీ, ఎస్టీ మహిళలకు పంచాల్సిన భూములను కొందరు నకిలీ పత్రాలతో కాజేసి ఈ కుంభకోణానికి పాల్పడ్డారు. ఇటీవల రూ.88 కోట్ల వాల్మీకి కుంభకోణం వెలుగుచూడగా, లోకాయుక్త అధికారులు పలు చోట్ల దాడులు నిర్వహించారు. ఆ సమయంలోనే తాజా కుంభకోణం బయటపడింది.

డేటింగ్ యాప్‌ల్లో 700 మందికి మోసం

ఢిల్లీ యువకుడి అరెస్ట్

న్యూఢిల్లీ, జనవరి 4: అమెరికాకు చెందిన అందమైన మోడల్‌గా చూపుకుంటూ..వందలాది మంది మహిళలను వేధించిన, బెదిరించిన ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆన్‌లైన్ వేదికలపై 700 మందికిపైగా మహిళలను మోసం చేసిన తుషార్ బిష్ట్(23)ను శనివారం ఢిల్లీ (వెస్ట్) సైబర్ పోలీస్ స్టేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బంబుల్, స్నాప్‌చాట్..డేటింగ్ యాప్‌ల్లో తనను తాను పెద్ద మోడల్‌గా పరిచయం చేసుకున్న తుషార్..వందలాది మంది మహిళలను ఆకర్షించాడు. అనంతరం అతడు వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సేకరించి..వారిని బ్లాక్‌మెయిల్ చేయడం, డబ్బు వసూలు చేసేవాడని డీసీపీ విచిత్ర వీర్ మీడియాకు వెల్లడించారు.

మణిపూర్ మిలిటెంట్లకు స్టార్‌లింక్ ఇంటర్నెట్!

న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసకు పాల్పడుతున్న మిలిటెంట్లు అక్రమంగా 'స్టార్‌లింక్' ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారని తెలుస్తున్నది. 'ది గార్డియన్' పత్రిక వార్తా కథనం ప్రకారం, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ అంతరిక్షం నుంచి ఇంటర్నెట్ సదుపాయాన్ని అందిస్తున్నది. భారత్‌లో స్టార్‌లింక్‌కు అనుమతి లేదు. అయితే, మయన్మార్‌లో మాత్రం అనుమతి ఉన్నట్టు గార్డియన్ పేర్కొన్నది. మణిపూర్‌కు సరిహద్దునే మయన్మార్ ఉండటంతో మిలిటెంట్లు స్టార్‌లింక్ ఇంటర్నెట్ వినియోగించుకోగలుగుతున్నారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్‌లో ఏడాదిన్నరగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

యూపీలో రోజుకు 50 వేల గోవుల వధ

బీజేపీ ఎమ్మెల్యే నందకిశోర్ సంచలన వ్యాఖ్యలు

ఘజియాబాద్: యూపీలో ప్రతి రోజూ 50 వేల గోవులను వధిస్తున్నారని, అయినా తమ ప్రభుత్వం మౌనంగా ఉంటున్నదని లోని నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే నందకిశోర్ గుజర్ సంచలన ఆరోపణలు చేశారు. గోవుల సంక్షేమం కోసం కేటాయిస్తున్న డబ్బులను అధికారులు తింటున్నారని ఆయన అన్నారు. ఇలాంటి వారికి అధినేతగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉన్నారని ఆరోపించారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 375 స్థానాలు గెలుస్తుందని, లేకపోతే చాలామంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోతారని హెచ్చరించారు.

శిక్ష పడ్డ అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లోకి..

అమెరికా చరిత్రలో ట్రంప్ 'రికార్డు'

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్ట్ ట్రంప్ పోర్న్ స్టార్ హష్ మనీ కేసులో శిక్ష ఖరారైనప్పటికీ శ్వేత సౌధంలో అడుగుపెడుతున్న తొలి నేతగా ప్రతికూల రికార్డ్ సృష్టించనున్నారు. పోర్న్ స్టార్‌కు హష్ మనీ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న ట్రంప్‌నకు శిక్ష విధిస్తానంటూ న్యూయార్క్ న్యాయమూర్తి హవాన్ మర్చన్ శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆయన శిక్ష అనుభవించాల్సిన అవసరం లేదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ నెల 20న ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనుండగా, 10వ తేదీన ఆయనకు శిక్ష విధిస్తామని మర్చన్ ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆయన జైలు శిక్ష అనుభవించకుండా, జరిమానా చెల్లించకుండా అన్ కండిషనల్ డిశ్చార్జ్‌ను అమలు చేస్తామని జడ్జి తెలిపారు. శృంగార తార స్టార్మీ డానియల్స్‌తో ట్రంప్ గతంలో ఏకాంతంగా గడిపారని ఆరోపణలు వచ్చాయి. 2016 ఎన్నికల్లో ఆమె దీనిపై నోరు విప్పకుండా ఉండేందుకు ట్రంప్ ఆమెకు 1.30 లక్షల డాలర్ల హష్‌మనీని ఇచ్చారన్నది ఆరోపణ.

ప్రపంచ అత్యంత వృద్ధ మహిళ మృతి

టోక్యో, జనవరి 4: ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలైన 116 ఏండ్ల జపాన్ మహిళ టోమికో ఇతోకా మృతి చెందినట్టు శనివారం అధికారులు ప్రకటించారు. ఆషియాలో నివసించే టోమికోకు నలుగురు పిల్లలు, ఐదుగురు మనవలు ఉన్నారు. డిసెంబర్ 29న ఆమె ఒక నర్సింగ్‌హోమ్‌లో చికిత్స పొందుతూ మరణించారని ఆ నగర మేయర్ తెలిపారు. స్పెయిన్‌కు చెందిన 117 ఏండ్ల బ్రన్యాస్ మోరియా గత ఏడాది ఆగస్టులో మరణించిన తర్వాత ప్రపంచంలో జీవించి ఉన్న అత్యంత వృద్ధ మహిళగా టోమికో నిలిచింది. కాగా, 12.4 కోట్ల జనాభా ఉన్న జపాన్‌లో మూడో వంతు 65 అంత కన్నా ఎక్కువ వయసున్న వృద్ధులు. సెప్టెంబర్‌లో వెల్లడైన గణాంకాల ప్రకారం ఆ దేశంలో 95 వేల మంది 100 లేదా అంతకన్నా ఎక్కువ వయసు ఉన్న వారుండగా, వారిలో 88 శాతం మహిళలు.

అవినీతిని వెలికి తీసినందుకు

జర్నలిస్ట్ హత్య?

- ఛత్తీస్‌గఢ్‌లో 120 కోట్ల రోడ్డు స్కామ్‌పై ముకేశ్ వార్త
- కొన్ని రోజులకే కాంట్రాక్టర్ ఇంట్లో అతడి శవం లభ్యం
- ఒక నిందితుడిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు

ముకేశ్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో ఓ పరిశోధక జర్నలిస్ట్ దారుణ హత్యకు గురయ్యారు. ఓ యూట్యూబ్ చానల్‌ను నిర్వహిస్తూ, ఎన్డీటీవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్న ముకేశ్ చంద్రకర్ ఇటీవల బస్తర్ ప్రాంతంలోని గంగలూరు-హిరోలీ రోడ్డు ప్రాజెక్టులో జరిగిన అవినీతిని బయటపెట్టారు. ఈ ప్రాజెక్టు టెండరు విలువ ప్రారంభంలో రూ.50 కోట్లు కాగా, ప్రాజెక్టు డిజైన్‌లో ఎలాంటి మార్పులు లేకుండా వ్యయాన్ని రూ.120 కోట్లకు పెంచినట్లు ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వార్తా కథనాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్ట్ నిర్మాణం, వ్యయంపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇటీవల విచారణకు ఆదేశించింది. ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ అయిన సురేశ్ చంద్రకర్ సోదరుడు రితేశ్ చంద్రకర్ ఈ నెల 1 రాత్రి ముకేశ్, సురేశ్‌ల మధ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ముకేశ్ ఫోన్ స్విచాఫ్ కావడంతో ఆయన సోదరుడు యుకేశ్ అనేక చోట్ల వెతికి ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముకేశ్ మృతదేహం బాగా ఉబ్బిపోయిన స్థితిలో చట్టన్‌పరలోని సురేశ్‌కు చెందిన ఇంటి ప్రాంగణంలోని సెప్టిక్ ట్యాంక్‌లో కనిపించింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాంట్రాక్టర్ సురేశ్‌ను పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు.

'చైనా వైరస్‌లపై ఆందోళన వద్దు'

న్యూఢిల్లీ:హ్యూమన్ మెటాన్యుమోనియా(హెచ్ఎంపీవీ)తో సహా చైనాలో ఇటీవల పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధుల కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం దేశ ప్రజలకు భరోసా ఇచ్చింది. చైనాలో పరిస్థితి అసాధారణమేమీ కాదని, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ సంసిద్ధంగా ఉందని ఆరోగ్య శాఖ ప్రకటించింది. పరిస్థితిని అంచనా వేసేందుకు సంయుక్త పర్యవేక్షణ గ్రూపుతో శనివారం సమావేశం నిర్వహించింది. అనంతరం ఓ ప్రకటన విడుదల చేస్తూ దేశవ్యాప్తంగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో గణనీయమైన పెరుగుదల ఉన్నట్టు ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపింది. హెచ్ఎంపీవీ వంటి వైరస్‌లు భారత్‌లో ఇది వరకు నుంచే వ్యాప్తిలో ఉన్నాయని, అటువంటి కేసులను సమర్థంగా ఎదుర్కోగల యంత్రాంగం తమకు ఉందని ఆరోగ్య శాఖ హామీ ఇచ్చింది. మరోవైపు చైనాలో పిల్లలు ఫీలైన్ ఇన్ఫెక్షియస్ పెర్టోనిటిస్ అనే ప్రాణాంతక వైరస్ బారిన పడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని పెంచుకుంటున్న కొందరు కొవిడ్‌కు వాడిన మందులను తమ పిల్లలకు వేస్తున్నట్టు స్థానిక మీడియా పేర్కొంది.

రైతుల నిరసనను ముగించే

ఉద్దేశం కేంద్రానికి లేదు

రైతు నేత రాకేష్ టికాయత్

ఫతేహాబాద్, జనవరి 4: ఖనౌరీ సరిహద్దులో రైతులు కొనసాగిస్తున్న నిరసన నుంచి కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా లబ్ధి పొందుతోందని రైతు నాయకుడు రాకేష్ టికాయత్ ఆరోపించారు. హర్యానాలోని ఫతేహాబాద్‌లో శనివారం జరిగిన రైతుల మహా పంచాయత్‌లో ఆయన ప్రసంగించారు. రోడ్లు మూతపడడంతో సిక్కులు(పంజాబీలు) తీవ్ర అసౌకర్యం చెందుతున్నందున రైతుల నిరసన కారణంగా పంజాబ్ ప్రభుత్వం చాలా ఇబ్బందులను ఎదుర్కొంటోందని ఆయన అన్నారు. ఈ కారణంగానే ఖనౌరీ సరిహద్దుల్లో జరుగుతున్న నిరసనకు ముగింపు పలకాలన్న ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేదని అన్నారు. ఈసారి రైతులు ఢిల్లీ యాత్ర చేపట్టినపుడు లోపల నుంచి దేశ రాజధాని నగరాన్ని చుట్టుముట్టే బదులుగా అన్ని వైపులా నుంచి నగరాన్ని దిగ్బంధించడం కోసం కేఎంపీ ఎక్స్‌ప్రెస్‌వేను చుట్టుముడతామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతానికి వివిధ ప్రదేశాలలో యునైటెడ్ కిసాన్ మోర్చా పంచాయత్‌లను నిర్వహిస్తుందని, ఢిల్లీ యాత్ర ప్రారంభం కావడానికి ముందు రైతులకు పిలుపునిస్తామని ఆయన చెప్పారు. రైతుల ఢిల్లీ యాత్రకు ఇంకా తేదీ ఖరారు చేయలేదని ఆయన తెలిపారు. రైతులు వివిధ పద్ధతులలో తమ నిరసనలు తెలియచేస్తున్నారని, ప్రస్తుతం దేశంలో దాదాపు 700 రైతు సంఘాలు ఉన్నాయని టికాయత్ చెప్పారు.

ఉత్తరాదిపై చలి పంజా

ఉత్తరాదిలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి ప్రజలను గజగజ వణికిస్తున్నది. రాజధాని ఢిల్లీతో పాటు పలు ప్రాంతాలను పొగమంచు కమ్మేసింది.శనివారం ఢిల్లీలో 8.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, కశ్మీర్‌లో మైనస్‌కు పడిపోయింది. రానున్న రెండు రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగవచ్చునని వాతావరణ శాఖ తెలిపింది. దట్టమైన పొగమంచు కారణంగా రహదారులు కనిపించక పలు చోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పంజాబ్-హర్యానా, హిస్సార్-చండీగఢ్ రహదారులపై జరిగిన ప్రమాదాల్లో ఏడుగురు మరణించారు. ఢిల్లీ విమానాశ్రయంలో వరుసగా రెండో రోజూ కూడా విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 19 విమానాలను దారి మళ్లించగా, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడిచాయి.

మా ప్రయోజనాలను కాపాడుకుంటాం

చైనా బ్రహ్మపుత్ర ప్రాజెక్టుపై భారత్ స్పందన

న్యూఢిల్లీ, జనవరి 4: బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అత్యంత భారీ డ్యామ్‌ను నిర్మిస్తామని చైనా చెప్పన్నది. పర్యావరణపరంగా ఎంతో సున్నితమైన టిబెట్‌లోని హిమాలయన్ జోన్‌లో భారత సరిహద్దుకు అత్యంత సమీపాన నిర్మించనున్న ఈ ఆనకట్ట ఇప్పటికే సెంట్రల్ చైనాలోని యాంగ్జీ నదిపై నిర్మించిన త్రీగోర్జెస్ డ్యామ్ కంటే పెద్దగా ఉంటుందని ప్రకటించింది. దీంతో శుక్రవారం చైనాకు భారత్ ఓ గుర్తింపు నోట్(రిమైండర్) పంపింది. బ్రహ్మపుత్ర నది విషయంలో భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంటుందని ఆ రిమైండర్‌లో స్పష్టం చేసింది. ఈ నదీ జలాలపై భారత్‌కు ఉన్న హక్కులను పునరుద్ఘాటించడంతోపాటు ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్మాణం విషయంలో చైనా పారదర్శకంగా వ్యవహరించాలని కోరింది. పరిణామాలను భారత్ ఎప్పటికప్పుడు గమనిస్తుందని, అవసరమైనప్పుడు తగిన చర్యలు చేపడుతుందని చైనాకు తెలియజేసినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు.

అదిగో నల్ల చిరుత

ఒడిశాలోని నయాగఢ్ జిల్లా అడవుల్లో అత్యంత అరుదైన (మెలాంన్‌స్టిక్ రకం) నల్ల చిరుత కనిపించింది. పిల్ల చిరుతతో అడుతున్న బ్లాక్ పాంథర్ దృశ్యాలు అడవిలో అమర్చిన కెమెరాలో రికార్డైంది. ఈ చిరుత చిత్రాలు ఈ ప్రాంతపు అద్భుతమైన జీవ వై